క్లుప్తంగా

శ్రీమహావిష్ణువు లీలను చాటిన నృత్య రూపకం



విజయవాడ కల్చరల్: ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థా కళాపీఠం (అకాడమీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థా కళాశాలలోని కళావేదికపై శనివారం ప్రదర్శించిన తిరుమంగై ఆళ్వార్ నృత్య రూపకం శ్రీ మహావిష్ణువు లీలను చాటింది. 12 మంది దివ్య ఆళ్వారులలో తిరుమంగై ఒకరు. శ్రీ మహావిష్ణు లీలలను వర్ణిస్తూ తిరుమంగై పాశురాలను రచించారు. వైష్ణవ తత్వాన్ని ప్రచారం చేసిన ధన్యజీవి తిరుమంగై. నృత్య కథా రచయిత గాడేపల్లి వెంకట్ మాట్లాడుతూ ఆళ్వారులు రచించిన పాశురాలను ఆధారం చేసుకొని నృత్య రూపకాన్ని రచించడం జరిగిందని తెలిపారు. డీసీవీ శాస్త్రి సంగీత సహకారం అందించారు. గిరీష్ చంద్ర, దేవీ గిరీష్, చంద్ర బృందం కనుల పండువగా నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ ప్రారంభించి కళాకారులను పరిచయం చేశారు. నిర్వాహకులు ఎస్.లలిత్ ప్రసాద్, కార్యదర్శి బీవీఎస్ ప్రకాష్, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య పాల్గొన్నారు. కళాకారులను ఆత్మీయంగా సత్కరించారు. సిద్ధార్థ విద్యా సంస్థలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వారి అన్నప్రసాదం భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా శనివారం టీటీడీ కల్యాణ మండపంలో దాతలు డాక్టర్ బీవీ రంగారావు, వెంకట నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో 200 మంది భక్తులకు అన్నప్రసాదం అందించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమలలో శ్రీ వారికి ఉపయోగించిన పూలతో తయారు చేసిన అగరుబత్తీ, సబ్బులు తదితరాలను విక్రయించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి మాట్లాడుతూ శుక్ర, శని, ఆదివారాల్లో అన్న ప్రసాదం అందిస్తామని తెలిపారు. బుధవారం నుంచి టీటీడీ ప్రచురించిన డైరీలు, క్యాలెండర్‌లు, చిన్న క్యాలెండర్లు భక్తులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

పారదర్శకంగానే రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలు

విజయవాడస్పోర్ట్స్:ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం(ఐజీఎంసీ)లో ఈ నెల 27వ తేదీన రాష్ట్ర స్థాయి జూనియర్ (అండర్-20) బాల, బాలికల ఫెన్సింగ్ పోటీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వి.నాగేశ్వరరావు వెల్లడించారు. ఫెన్సింగ్ పోటీల్లోనూ, రాష్ట్ర జట్టు ఎంపికలోను అక్రమాలు చోటుచేసుకున్నాయని జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఖండించారు. ఐజీఎంసీ స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం వద్ద శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ ఏ ఐ) వెబ్ సైట్ లో రిజిస్టర్ అయిన క్రీడాకారులతోనే పోటీలు నిర్వహించాలనే నిబంధన ఉందని స్పష్టం చేశారు. అండర్-20 వయస్సు విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 130 మంది క్రీడాకారులు మాత్రమే ఎఫ్ ఏ ఐ వెబ్ సైట్ లో రిజిస్టర్ అయ్యారని, వీరిలో 50 మంది మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు.

కాశీవిశ్వేశ్వర దేవస్థానంలో సహస్ర దీపోత్సవం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):కార్తిక మాసం సందర్భంగా గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో సహస్ర దీపోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాకృతిలో దీపాలు వెలిగించి స్వామి వారిని ఆరాధించారు. ఆలయ ఈఓ వై.సీతారామయ్య పర్యవేక్షణలో దీపోత్సవం నిర్వహించారు.

కనిపించని స్వచ్ఛత ఆనవాళ్లు!

- ప్రభుత్వ కార్యాలయ పరిసరాల్లో చెత్తాచెదారం
- మ్యూజియం రోడ్డులో ముక్కుమూసుకోవాల్సిందే
- వీఎంసీ చర్యలు తీసుకోవాలని వినతి



ఇరిగేషన్ కార్యాలయ సముదాయాల మధ్య చెత్తాచెదారం



అధ్వానంగా కలెక్టరేట్ పక్కన మ్యూజియం గోడకు ఆనుకుని ఉన్న టాయిలెట్స్



దుర్వాసన వస్తున్న డ్రెయినేజీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లోనే స్వచ్ఛత ఆనవాళ్లు కనిపించడం లేదు. నిత్యం జిల్లా స్థాయి అధికారులు తిరిగే ప్రాంతాల్లోనే పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పరిసరాల శుభ్రత, స్వచ్ఛ సర్వేక్షణ అని నిత్యం జపిస్తున్నా అది ఆచరణలో సాధ్యం కావడం లేదు. పచ్చటి పూల మొక్కలతో కళకళలాడాల్సిన కార్యాలయాల పరిసరాల్లో చెత్త, పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. కోర్టులు, ఇరిగేషన్ కార్యాలయాల సముదాయం, కలెక్టరేట్ వెనుక, పక్క రోడ్డులో పారిశుద్ధ్యం దారుణంగా మారింది. జిల్లా కలెక్టరేట్, బాపూ మ్యూజియం మధ్య ఉన్న మ్యూజియం రోడ్డులో కలెక్టరేట్ గోడకు అనుకుని రెండుమూడు డంపర్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. ఆ పరిసరాల్లో చెత్తనంతా తీసుకొచ్చి వాటిలో వేస్తున్నారు. అవి పూర్తిగా నిండిన తర్వాత మాత్రమే వాటిని తొలగిస్తున్నారు. దీంతో అక్కడంతా దుర్వాసన వస్తోంది. ఇక్కడే రోడ్డుకు ఓ వైపు పూర్తిగా పండ్ల వ్యాపారులు తోపుడు బండ్లు ఏర్పాటు చేశారు. దీంతో కలెక్టరేట్ వైపు డ్రెయిన్ పూర్తిగా మూసుకుపోయింది. దీనిలోనే చెత్తాచెదారం నిండిపోయింది. పాడైపోయిన పండ్లు వేస్తున్నారు. ఈ చెత్త మధ్య అప్పుడప్పుడు ఎలుకలు చచ్చిపోయి కలెక్టరేట్ లోపలికి దుర్వాసన వస్తోంది. పూర్తిగా కాలువలో చెత్తా చెదారం తొలగిస్తే తప్ప అక్కడ ఏం చచ్చి వాసన వస్తోందో కూడా గుర్తించలేని పరిస్థితి. ఇదే రోడ్డులో మ్యూజియం గోడకు ఆనుకుని కాలువపై రెండు టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వాటిని అక్కడ వ్యాపారాలు చేసేవారు, ఆ రోడ్డుపై వెళ్లే వారు వినియోగిస్తున్నారు. నీటిని సరిగా వినియోగించకపోవడం. డోర్లు తెరిచే ఉంచడంతో ఆ ప్రాంతమంతా వాసన వస్తోంది. మ్యూజియం రోడ్డులో ఓపెన్ డ్రెయిన్ కావడంతో దానిని నుంచి వచ్చే వాసనతో ఆ రోడ్డులోకి రాగానే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇరిగేషన్ కార్యాలయాల ఆవరణలో....

కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయం వెనుక, ఇరిగేషన్ కార్యాలయ ప్రహరీకి ఆనుకుని చెత్త డంప్ చేశారు. ఇక్కడ నూతన భవనాలు నిర్మించినప్పటికీ లోపలికి వెళ్లే దారిని బాగు చేయలేదు. ఈ దారి వెంబడి గోడ పక్కన చెత్త, చిత్తు కాగితాలు కుప్పపడ్డాయి. కార్యాలయాల్లో వేస్ట్ పేపర్‌ను ఇక్కడ తెచ్చి వేస్తున్నారు. దానిని తొలగించకపోవడంతో పేరుకుపోయింది. మ్యూజియం రోడ్డు నుంచి ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ కార్యాలయానికి వెళ్లే వరకు ఓ వైపు చెత్తా చెదారం ఉంది. పిచ్చి మొక్కలు, విరిగి పడి ఎండిపోయిన చెట్ల కొమ్మలతో నిండిఉంది. ఎప్పటి నుంచో వినియోగించకుండా ఉన్న వాహనాలు చుట్టు చెత్తచేరి పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిత్యం ఈ ప్రాంతాల్లోనే తిరుగుతూ ఉంటారు. అయినప్పటికి ఏ ఒక్కరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ కార్యాలయాల పరిసరాల్లోనే పరిస్థితి దయనీయంగా ఉండడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. మ్యూజియం రోడ్డులో దుర్వాసన రాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

మధురంగా సాగిన గాత్ర కచేరి



విజయవాడ కల్చరల్: శ్రీసద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో 31 వ వార్షిక సంగీత మహోత్సవాల సందర్భంగా దుర్గాపురంలోని శివరామ కృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శనివారం నాటి కార్యక్రమంలో విఖ్యాత విదుషీమణి ఐశ్వర్యా విద్యారఘునాథ్ నిర్వహించిన గాత్ర సంగీత కచేరీ మధురంగా సాగింది. సంగీత త్రిమూర్తులు సద్గురు త్యాగరాజస్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి రచించిన కీర్తనల తోపాటు, తోడిరాగం ఆదితాళంతో ప్రారంభించి, సీతాపతే నామనసున, శ్రీమాతృభూతం తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. వయోలిన్ పై వీఎస్‌పీజీ శివానీ, మృదంగంపై బీవీఎస్ ప్రసాద్ సహకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సద్గురు సంగీత సభ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్, సంగీత విద్వాంసురాలు గాయత్రీ గౌరీనాథ్, నిర్వాహక సంఘ సభ్యులు బి.హరిప్రసాద్, జెఎస్ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఆదివారంతో సంగీతోత్సవాలు ముగుస్తాయి చివరిరోజు కార్యక్రమంలో హిందూస్తానీ సంగీత కార్యక్రమంలో భాగంగా కె.సంతోష్‌కుమార్ వయోలిన్ కచేరి ఉంటుంది.

హెచ్ఐవీ రహిత సమాజస్థాపనకు కృషి



అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): హెచ్ఐవీ సోకిన వారిని ఆదరించాలని ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గౌతం అంబేడ్కర్ తెలిపారు. ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యాన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. గౌతం అంబేడ్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మనం చేసే ఒక చిన్నతప్పు జీవితంపై ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవటంతో పాటు సక్రమ పద్ధతిలో నడవాలని సూచించారు. హెచ్ఐవీ రహిత సమాజస్థాపనకు యువత తమ వంతు సహాయ సహకారం అందించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి పూర్తిగా అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇంటి చుట్టుపక్కలవారికి తెలియచేయాలని కోరారు. ఏఆర్టీ సెంటర్ కౌన్సిలర్ కనకాల వరప్రసాద్ హెచ్ఐవీ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది.... రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స తదితర విషయాలను వివరించారు. కళాశాల అంతర్గత ప్రమాణ మండలి సమన్వయకర్త డాక్టర్ జె.నాగేశ్వరరావు, రెడ్‌రిబ్బన్ క్లబ్ సమన్వయకర్త ఎస్ఎల్ జానకి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ శర్వాణి , మైక్రోబయాలజీ ఇన్‌చార్జి అరుణ తదితరులు మాట్లాడారు. అనంతరం ఏలూరు రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కంచికచర్ల గురుకుల కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ అధ్యక్షతన హెచ్ఐవీ, ఎయిడ్స్ అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రోగ్రామ్ మేనేజర్ కె.రాణి ముఖ్య అతిథిగా పాల్గొని హెచ్ఐవీ, ఎయిడ్స్ గురించి వివరించారు. అనంతరం కళాశాలలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నీరజ అధ్యాపకులు సుధారాణి, లావణ్య, సత్యవాణి, కె.బాలకృష్ణ, అరుణ పాల్గొన్నారు.

అలరించిన ఆపాత మధురాలు



విజయవాడ కల్చరల్: ఆర్ రాజు మెలోడీస్ ఆధ్వర్యంలో తొలి కార్యక్రమంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయనీ గాయకులు, రాజు ఆధ్వర్యంలో ఘంటసాల, పీబీ శ్రీనివాస్, మాధవపెద్ది సత్యం, జేసుదాసు రచించిన గీతాలను మధురంగా ఆలపించారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ నూతన గాయనీ గాయకులకు అవకాశం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, శ్యాంప్రసాద్, మహేశ్వరి, సీత, మాంతి రమణారావు తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు

వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వినియోగదారులపై రూ. 9,412 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీల భారం వేయడం సరికాదని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ చార్జీల భారంపై ఏపీఈఆర్సీకి అభ్యంతరాలు వ్యక్తం చేసినా పరిగణలోకి తీసుకోకపోవటం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6 నెలల కాలంలో ప్రజలపై విద్యుత్‌చార్జీల భారం మోపడం ఇది రెండోసారి అని మండిపడ్డారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 6,073 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడంతో ప్రజలు అంధకారంలో బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు. ఈ ఛార్జీలను యూనిట్ కు రూ. 1.27 చొప్పున ఈనెల నుంచి వసూలు చేస్తున్నారని.. తాజా చార్జీలు రూ. 0.92 తో కలిపి జనవరి నుంచి యూనిట్ కు రూ. 2.19 అదనంగా వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ముందు ఓమాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోమాట చెప్పడం బాబుకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కరెంట్ చార్జీలు పెంచబోమని అవసరమైతే తగ్గిస్తామని ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్లు బాబు చెప్పిన మాటలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. కరెంట్ చార్జీలు పెంచేది లేదని 19 మార్చి, 2019 న కడపలో ఓసారి...., రాబోయే రోజుల్లో చార్జీలు తగ్గిస్తామని 27 మే 2020 న టీడీపీ మహానాడులో మరోసారి., టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే చార్జీలు తగ్గించే వాళ్లమని 10 ఆగస్టు 2022లో ఇంకోసారి....., అవసరమైతే వినియోగదారులే విద్యుత్ అమ్ముకునేలా చేస్తానని 2 ఆగస్టు, 2023 న పులివెందులలో మాయమాటలు చెప్పి ప్రజలను బాబు మోసగించారని ధ్వజమెత్తారు. చివరకు 16 ఆగస్టు, 2023 న విడుదల చేసిన విజన్ డాక్యుమెంట్ లోనూ చార్జీలు తగ్గిస్తామని పొందుపరిచి.. ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రాబోయే ఐదేళ్లు కరెంట్ చార్జీలు పెంచబోమంటూ ఆగస్టు 2 న విద్యుత్ రంగంపై సమీక్షలోనూ బాబు చెప్పారని.. కానీ 6 నెలల కాలంలో ఏకంగా రూ. 15,485.36 కోట్ల భారం ప్రజలపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంధన సర్దుబాటు చార్జీల భారాన్ని వినియోగదారుల మీద మోపకుండా.. రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలే భరించాలన్నారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని మల్లాది విష్ణు హెచ్చరించారు.



హోరాహోరీగా క్రీడా పోటీలు



విజయవాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఎన్టీఆర్ జిల్లా స్థాయి పోలీస్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్-2024 పోటీలు హోరాహోరాగా సాగాయి. చివరిరోజు పోటీల్లో భాగంగా టగ్గాఫ్‌వార్, అథ్లెటిక్స్, జావెలిన్‌త్రో, హామర్‌త్రో, త్రోబాల్ పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





ఎయిడ్స్ నివారణ అందరి బాధ్యత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీఐ కృష్ణమోహన్, డాక్టర్ వెంకట్

నున్న సీఐ కృష్ణమోహన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):అవగాహనతో మాత్రమే ఎయిడ్స్ వ్యాధిని నివారించగలమని.. ఎయిడ్స్ మహమ్మారిని అంతమొందించే బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని నున్న సీఐ కృష్ణమోహన్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని యునైటెడ్ ఎన్జీవో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ యువజన సర్వీసుల శాఖ, స్మైల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్‌లో శనివారం ఎయిడ్స్ అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. నందమూరినగర్ సాయిబాబా గుడి వద్ద నుంచి జరిగిన ఈ ర్యాలీని నున్న సీఐ కృష్ణమోహన్, డాక్టర్ వెంకట్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి పట్ల అందరూ అవగాహన పెంచుకోవాలని.. ప్రధానంగా యువత దీనిపై దృష్టిపెట్టి.. దీని నివారణకు చేతులు కలపాలని పిలుపునిచ్చారు. ఎయిడ్స్ వ్యాధిని నివారించటం మనందరి బాధ్యత అని.. 'నా ఆరోగ్యం.. నా హక్కు..' అని నినాదాలు చేయించారు. స్మైల్ హాస్పటల్ డాక్టర్ వెంకట మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ అనేది ప్రాణాంతకరమైనదని.. మనందరం అవగాహన పెంచుకొని సమాజం నుంచి దీనిని శాశ్వతంగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. యువజన సర్వీసుల శాఖ సీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ సోకినవారు బాధపడాల్సిన అవసరం లేదని, గవర్నమెంట్ కూడా చాలావరకు సహకారం అందిస్తుందన్నారు. అనంతరం పల్లీలు, బెల్లం, రాగి పిండి, జొన్న పిండి కలిగిన న్యూట్రిషియన్ కిట్‌లను పంపిణీ చేశారు. రాజీవ్ నగర్ ఆయుర్వేద హాస్పటల్ డాక్టర్లు సుజాత డోకే, నిశాంత్, అంగన్‌వాడీ టీచర్లు గజలక్ష్మి, కీర్తి, రమాదేవి, రమణ, యునైటెడ్ ఎన్జీవో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, దయాకర్ పాల్గొన్నారు.





విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని స్టెల్లా కళాశాల కరస్పాండెంట్ లీనా క్వాడ్రస్ అన్నారు. స్టెల్లా కళాశాల్లో జరుగుతున్న క్రిస్మస్ ఫెట్‌లో భాగంగా శనివారం నిర్వహించిన ఫ్యాషన్ షోలో విద్యార్థులు ర్యాంప్‌పై హొయలొలికారు. మిస్ స్టెల్లాగా మనీషా గెలుచుకున్నారు. ద్వితీయ స్థానంలో ఆషా గుర్జర్, తృతీయ జాహ్నవి గెలుపొందారు.

ఫ్యాషన్ షో అదరహో...

–పటమట(విజయవాడతూర్పు)